


# హంపీడంపీ

కంఠంనేని రాధాకృష్ణమూర్తి

"వరకట్నం మీద మీ అభిప్రాయమేమిటండీ?"

ఆకాశవాణి తరపునుంచి వచ్చిన పెద్దమనిషి ఆ పూట లేడీస్ క్లబ్‌లో ఇంటర్వ్యూ తీసుకుంటూ టేపుచేసుకుంటున్నాడు.

ఒకసారి దగ్గి గొంతుక సవరించుకుందామె.

ఆ క్లబ్‌కు సెక్రెటరీ - ఆమె పేరు వర్ధనమ్మ.

"వరకట్నమనేది మన సమాజంలో నాటుకు పోయిన ఒక పెద్ద దురాచారమండీ," ఆమె అన్నది. "నానాటికి అది ఊడల్ని పెంచుకుంటూ సమాజమంతటినీ ఆక్రమించుకుని తన వాడి కోరలతో అనేక మంది అమాయిక అబలల్ని బలితీసుకుంటోంది...."

ఓ మారు చుట్టూ పరికించి చూసిందామె, తన చెలులవేపు, ఇంటర్వ్యూ తీసుకుంటున్న పెద్దమనిషి వేపూ

అంతా మెచ్చుకోలుగా చూస్తున్నారు,

ఆమెకి నలభై అయిదేళ్ళుంటాయి. బక్కగా పొడుగ్గా ఉన్నది. తల మీద




వెంట్రుకలు ఇక్కడక్కడా మెరిశాయి

"ఈ సంకటాన్ని రూపుమాపటములో ఒక్క ప్రభుత్వానికి మాత్రమే బాధ్యత ఉందనుకుంటే అది సంకుచితమవుతుంది..." ఆమె మళ్లీ అన్నది

ఇంటర్వ్యూ తీసుకుంటున్న అతని కళ్లు తళుక్కున మెరిశాయి వీలయినంతలో ప్రభుత్వాన్ని విమర్శించే స్టేట్‌మెంట్లు ఇంటర్వ్యూలలో లేకుండా ఉండేట్లు చూసుకోవాలి అతను. ఒకవేళ అవి ప్రభుత్వాన్ని సమర్థించేవిగా ఉంటే మరి మంచిది,

"ఊఁ, ఇంకా చెప్పండి!" ఉత్సాహంగా ముందుకు వంగి అన్నాడు.

"సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తి తనో డాక్టరు గానూ, వరకట్నాన్ని రుగ్మతగానూ భావించి బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తే ఈ సమస్య చాలా త్వరగా నశించి పోతుందండీ."

మహిళా మెంబర్లంతా ఒక్కసారి చప్పట్లు చరిచారు

"ఇంకేమైనా పరిష్కార మార్గాలు సూచించగలరాండీ?" అడిగాడతను

"మన చట్టాల్ని కూడా మరికొంచెము మార్చుకోవాలండీ. ఈ బాపతు నేరాలకి ఆ వరుణ్ణీ అతడి తల్లి దండ్రులని నడి బజారులో నిలబెట్టి కాల్చిపారేసేలాంటి శిక్షలు నిర్దేశించబడాలి ...."

మళ్ళీ చప్పట్లు.

"అంటే అరబ్బు దేశాల తరహాలో నంటారు?"

"అవునండీ, నా అభిప్రాయం అదే"

"అంతే కాదండి మరో మహిళామణి అన్నది. "ఇప్పుడు షెడ్యూల్డు కులాల వాళ్ళకు ఇస్తున్న రీతిలో ఆడపిల్లలకు ప్రభుత్వం కొన్ని రిజర్వేషన్ల రాయితీలని కల్పించాలి. రిజర్వేషన్లు ఉద్యోగాల విషయాల్లో అయితే రాయితీలు ఆడపె పెళ్ళి సమయంలో కొంం డబ్బు ముట్ట చెప్పటం రూపంలో...."

"అసలదీ కాదు," మరొకామె అందుకుంది. "ఈ కట్నమనేది ఆడపిల్లవాళ్లు మగపిల్ల వాళ్ళకు ఇచ్చుకోవటము కాకుండా వరుడే పెళ్ళికూతురికి ఇచ్చుకునేటట్లుగా వుండాలి."

"కాని ఇది మళ్ళీ కట్నంలోకే వస్తున్నది కదా?" నవ్వుతూ అడిగాడతను.

"రాదండీ," ఆవేశంగా అన్నది ఆమె.

"తరతరాలుగా స్త్రీకి జరిగిన అన్యాయానికి పురుషుడు ఆ మాత్రాన్ని కొన్నాళ్ళవరకు భరించక తప్పదు!"

"కరెక్ట్, కరెక్ట్!!"

"సరిగ్గా చెప్పారు!"

చప్పటే చప్పట్లు....

o o o

సోఫాలో కూర్చుని తల వెనక్కి వాల్చి అలసిపోయినట్టుగా కళ్లు మూసుకుంది వర్ధనమ్మ. ఆనందము, ఏదో ఉత్సాహమూ, తృప్తి ఆమె మనసు నిండా ఆవరించుకున్నాయి....

పరిపూర్ణ జీవితం తనది. మగడిది పెద్ద ఆఫీసరు ఉద్యోగం, అంత పెద్ద ఆఫీసరూ తన చెప్పుచేతల్లో ఉంటున్నాడు. ఒకోసారి ఆయన కింద పని చేసే ఉద్యోగుల్ని ఇంటికి పిలిపించి రిమాండ్ చేస్తూ ఉంటుంది నేరుగా. ఆయనకంటే తనను చూసి భయపడుతుంటారు వాళ్లు ఎక్కువగా.

సన్నగా నవ్వుకుందామె.

లేడీస్ క్లబ్ తరపున ఆమె తరచుగా సాంస్కృతిక కార్యాక్రమాలని నిర్వహిస్తుంటుంది. ఎక్కడ చూసినా తనేఅయి కనిపిస్తుంటుంది. సమాజంలో పురుషుడి ఆధిక్యత గురించి స్టేజిమీద ఆవేశంగా ఉపన్యాసాలిస్తుంటుంది.

ఆవేళ రేడియో ఇంటర్వ్యూలో తను అన్న మాటలని మరోమారు గుర్తుతెచ్చుకుందామె కొద్దిగాగర్వాన్ని ఫీలయింది ఆ ప్రోగ్రాము వచ్చేనాడు రేడియోను తప్పకసరిగా వినాలి. తన స్వరం ఎట్లా వచ్చిందో రేడియోలో తన ఆవేశం ఎట్లా ప్రతిఫలించిందో....

సడన్‌గా ఆమెకు సుశీల గుర్తుకొచ్చింది.

లేడీస్ క్లబ్బులో సుశీల కూడా ఒక మెంబరు. ఏదో కాలేజీ చదువులు వెలగబెట్టింది ఒక యర్డీసీ భార్య. కాని ఎంత టెక్కని!? మిగతా మహిళా మెంబర్లంతా తమ భర్తల తాలూకు దానిసత్వాన్ని క్లబ్బులో ప్రతిఫలింపజేస్తూ చాటున ఎట్లా చెవులు కొరుక్కున్నాగాని తన ఎదురున మట్టుకి అణిగి మణిగి ఉంటూ తమ పబ్బాల్ని గడుపుకో చూస్తుంటే ఈ పిల్లమాత్రం అట్లాకాదు. ఎవరినీ లెక్కచేయదు. తనతో నే చాలాసార్లు వాదనలకు దిగింది అందుకే తనకా పిల్లంటే మంట. మెల్లగా ఈయనతో చెప్పి దాని మొగుడిని ఇక్కడనుంచి ట్రాన్స్‌ఫర్ చేయించాలి....

ఈమె ఇట్లా ఆలోచనల్లో ఉన్న సమయాన పొట్టిగా, లావుగా, ఇంత పెద్ద పొట్టతో ఉన్న ఒక వ్యక్తి నెమ్మదిగా లోపలికి ప్రవేశించాడు ఆమె ఆలోచనలకు ఎక్కడ భంగం కలుగుతుందోనన్నట్లుగా మెల్లగా నడుచుకుంటూవచ్చి ఆమె కెదురుగా వున్న సోఫాలో కూర్చున్నాడు.

అతను ఆమె భర్త!

ఆమె మొహంలోకి చూస్తూ కొద్దిసేపు అట్లా కూర్చున్నాడతను, ఆమె కళ్ళెప్పుడు తెరుస్తుందా అని ఎదురు చూస్తున్నటుగా ఉందతని వాలకం.

"ఏమన్నారు వాళ్ళు!"

ఖంగుమంటూ వినిపించిన ఆమె స్వరానికి ఉలికిపడ్డాడతను

"నలభయి వేలవరకూ ఇవ్వగలమంటున్నారు" నెమ్మదిగా చెప్పాడు

చటుక్కున కళ్లు తెరిచిందామె.

"మీరేమన్నారు?" తీక్షణంగా చూసిందామె

"ఏమంటారు, వప్పుకునేవుంటారు" మళ్ళీ తనే అన్నది వ్యంగంగా.

"లేదు లేదు" అతనన్నాడు "ఆలోచించి మళ్లీ చెబుతానన్నాను."

"ఇందులో ఆలోచించటానికి ఏమున్నదని?" కోపంగా అన్నదామె "వేలకు వేలు పోసి పిల్లవాడిని మెడిసిన్ చదివించింది వాళ్ళమ్మాయికి లంగా కట్టటానికనా? ఆ చదువుకయిన ఖర్చుని మనం మళ్ళీ రాబట్టుకోవద్దా? వాడి చదువు ద్వారా వచ్చిన సంపాదనతో రేపు సుఖపడేది మన అబ్బాయి ఒక్కడే కాదు కదా! వాళ్ళ అమ్మాయి కూడా అనుభవించదా? ఇదేం కాదు చెబుతున్నాను వినండి- అరవై వేలకు ఒక్క పైసా తక్కువైనా వప్పుకోవద్దు. అట్లా కాక వప్పుకున్నారంటే మాత్రం నేను ఉరి పెట్టుకోవటం ఖాయం"

"సరే సరే" అతను లేచి నిలుచున్నాడు.

నిమ్మళంగా నడుచుకుంటూ పోయి మెట్లెక్కుతున్న భర్త వైపు అలా చూస్తూ కూర్చుండి పోయింది ఆమె. అతను పై మెట్టు ఎక్కబోతూండగా ఆమె మళ్ళీ కేకేసింది.

"నేను చెప్పింది గుర్తుంచుకున్నారు కదూ?"

అతను ఆగి వెనక్కి తిరిగి చూశాడు.

"విన్నాను వర్ధనం అరవై వేలకు పైసా తక్కువయినా వప్పుకోను"

తృప్తిగా తల పంకించిందామె మళ్ళీ వెనక్కి వాలి కళ్లు మూసుకుంది

హఠాత్తుగా ఆమెకు ఆ వేళటి రేడియో ఇంటర్వ్యూ గుర్తుకొచ్చింది. వర[illegible] [illegible]సిస్తూ తను మాట్లాడిన మాటలు గుర్తుకొచ్చాయి. అదే సమయాన ఆమె కళ్లముందు సుశీల మెదిలింది. రేపు తన కొడుక్కి పెళ్ళయాక సుశీల అందరిముందూ తనను అడక్కుండా ఉంటుందా?"

"కట్నం తీసుకోకూడదంటు ఆ రోజు మీరు రేడియో ఇంటర్వ్యూలలో చెప్పారు, మరి మీ అబ్బాయికి ఎట్లా తీసుకున్నారు?"

-అని అడిగితే?

అవునవును అడుగుతుంది. తప్పకుండా అడుగుతుంది. ఓర్వలేని ముండ-

ఈ ఆలోచన రాగానే ఆమె చాలా సేపు అనీజీగా ఫీలయింది.....

ఆ రాత్రి పక్కమీదకు చేరేవరకు కూడా ఆ అశాంతి నుంచి తప్పించుకోలేకపోయింది ఆఖర్న నిద్రపట్టబోయే ముందు తనకు తట్టిన ఒక సమాధానానికి ఆమె తృప్తిగా నిట్టూర్చింది.

ఆ సమాధానం ఇదీ- అట్లాంటి ప్రశ్నలకు తనదీరీతిగా సమాధానం చెబుతుంది

"మీకు తెలుసుకదమ్మా ఈయనకెంత చాదస్తమో! మా వాడికి పెళ్ళి చెయ్యకుండానన్నా ఉంటానన్నాడుగానీ అరవై వేలు కట్నం తీసుకోకుండా మాత్రం ఉండనన్నాడు అయినా మీకు తెలియనిది ఏముందమ్మా, ఆడది బయట ఎన్ని తెలివైన కబుర్లు చెప్పినా ఇంట్లో కెళ్ళేసరికి మాత్రం మగడి ఆలోచనలకే, నిర్ణయాలకే తలవొగ్గాల్సి వస్తోంది ఇదిగో, ఈ పరిస్థితే మారాలని నేను మొదటి నుంచి మొత్తుకుంటోంది...."

సెభాష్!!

ఆ తర్వాత ఆమె హాయిగా నిద్రపోయింది. ★